క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పనుల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 వరకు మండలంలోని వెంకటాపురం, కురవపల్లి, యాపదిన్నె, గుడిదొడ్డి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ నీలి గోవిందు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాపురం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



ధరూరు: మండల పరిధిలోని ర్యాలంపాడు సవారమ్మ దేవర సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతగా భీంపురం జట్టు విజయం సాధించింది. ద్వితీయ బహుమతిని పచ్చర్ల జట్టు, మూడో బహుమతిని ర్యాలంపాడు జట్టు, నాల్గవ బహుమతిని గట్టు జట్టు గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం రాత్రి విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, గజేంద్ర, రాముడు, నర్సింహులు, భీమన్న, వెంకటేష్, రంగన్న,ప్రకాష్, పెద్ద నర్సింహులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ఉండాలి



మానవపాడు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో జీవనోపాధి నిమిత్తం వ్యాపారం చేసుకుంటున్న వారికి అండగా ఉండాలని యువజన నాయకుడు శ్రవణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో సుకన్య, తిరుమలేష్, గణేష్, శేఖర్, కృష్ణ, ఆంజనేయులు, లోకేష్‌నాయుడు, సంకటి రాజేష్, విజేయ్ నర్సింహ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మానవపాడు: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ వైద్యుడు సమరసింహారెడ్డి, డాక్టర్ జేజే బాబుగడ్డ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వివిధ కాలనీలో శుక్రవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అదే విధంగా ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చంద్రన్న, జయమ్మ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జడ్జిగా ఎంపికైన స్వర్ణమల్లికకు సన్మానం



గట్టు: మండల కేంద్రానికి చెందిన న్యాయవాది సంఘం సురేష్ కుమార్తె సంఘం స్వర్ణ మల్లికను శుక్రవారం జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ సన్మానించారు. గట్టుకు చెందిన సంఘం స్వర్ణమల్లిక ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన విషయం తెలిసిందే. మండలం నుంచి తొలి సారిగా జడ్జి ఉద్యోగం మహిళ ఎంపిక కా వడం సంతోషాన్ని కల్గించిందని వారు పేర్కొన్నారు.

భారత్ వీర జవాన్లకు టీఎన్‌జీఓ మద్దతు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉగ్రవాదులపై పోరాటం చేస్తున్న భారత్ వీర జవానులకు టీఎన్‌జీఓ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్, కోశాధికారి కృష్ణమోహన్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాద దేశం అయిన పాకిస్తాన్ దాడుల్లో వీర మరణం పొందిన జవాన్ మురళి నాయక్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. యుద్ధ సమయం లో ఉద్యోగులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కాల్వలు నీటితో నిండేనా..?

- పూర్తిగాని 100, 106 ప్యాకేజీ కాల్వల పనులు
- కంప చెట్లతో మూసుకుపోయిన వైనం
- 19 ఏళ్లయినా నీటిపారుదలకు నోచుకోని పొలాలు



వడ్డేపల్లి మండలం రామాపురం సమీపంలో ముళ్లపొదలతో మూసుకుపోయిన నెట్టెంపాడు కాల్వ

శాంతినగర్: నీటి పారుదలకు నోచుకోని పొలాలకు సాగునీరందించే లక్ష్యంతో నిర్మించ తలపెట్టిన నెట్టెంపాడు కాల్వల పనులు పూర్తికాకపోవడంతో భూములు కోల్పోయిన రైతులు నేటికీ ఆందోళన చెందుతున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో 96 కిలోమీటర్ల మేర కాల్వలు నిర్మించి నడిగడ్డలోని సాగునీటికి నోచుకోని మెట్ట పొలాలను సస్యశ్యామలం చేసే లక్ష్యంతో నెట్టెంపాడు 100, 106 ప్యాకేజీ పనులు మొదలుపెట్టారు. ల్యాండ్ అక్విజేషన్ చేసి 19 ఏళ్లయినా ఆయా ప్యాకేజీల పనులు పూర్తికాకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది. ఓ వైపు సారవంతమైన భూములను తక్కువ ధరకే కోల్పోయి మరో వైపు ఉన్న పొలాలు కూడా సాగు నీటికి నోచుకోక అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

2006లో మొదలు పెట్టిన పనులు

అలంపూర్ నియోజకవర్గంలో తుంగభద్ర నది కింద సాగుకు నోచుకోని మెట్ట పొలాలకు కృష్ణానది నీటితో సాగు నీరందించాలనే ఉద్దేశంతో 2006లో నెట్టెంపాడు పథకాన్ని అప్పటి ప్రభుత్వం చేపట్టింది. రెండేళ్లలో పనులు పూర్తిచేసి మెట్ట పొలాలకు సాగునీరందించాలని లక్ష్యంగా పనులు మొదలు పెట్టారు. కాంట్రాక్ట్ పనులను టెండర్‌లో శ్రీనివాస సివిల్ వర్క్స్ దక్కించుకుని మొదలు పెట్టింది. 2011 వరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు వదిలేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి పదిహేనేళ్లపాటు పనులు నిలిచిపోయాయి. గతేడాది కాంట్రాక్ట్ పనులను ఇతరులకు అప్పగించి అక్కడక్కడ పనులు మొదలు పెట్టినా వాటిని పూర్తి చేయకపోవడంతో ఎగువ నుంచి నీటిని దిగువన ఉన్న వడ్డేపల్లి మండలంలోని మెట్ట పొలాలకు నీటిని విడుదల చేసేందుకు ఇబ్బందికరంగా మారింది.

56 వేల ఎకరాలు లక్ష్యం

నెట్టెంపాడు 100, 106 ప్యాకేజీల కింద 96 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వ, 18 డిస్ట్రిబ్యూటరీలతో పిల్ల కాల్వలు నిర్మించి 56 వేల ఎకరాలకు సాగునీరందించి సుమారు 2 వేల మంది రైతులకు న్యాయం చేయాలనే సంకల్పంతో పనులు ప్రారంభించారు. మొదట ఐదేళ్లపాటు చేపట్టిన పనులు 60 శాతం మాత్రమే పూర్తయ్యాయి. మిగతా పనులు పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల 60 సీ కింద 8 మంది కాంట్రాక్టర్లు పనులు చేపడుతున్నారు.

భూసేకరణ జరపక

106 ప్యాకేజీ కింద వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల, రామాపురం శివారులో రెండు కిలోమీటర్ల మేర భూములు సేకరించాలి. చివరన ఉన్న ప్యాకేజీలో ల్యాండ్ అక్విజేషన్ జరుపలేదు. అయిజ మండల పరిధిలోని యాపదిన్నె శివారులో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందలేదని పనులు చేపట్టలేదు. దీంతో 19 ఏళ్లయినా ప్రధాన కాల్వ పనులు పూర్తి కాలేదు. డిస్ట్రిబ్యూటరీ కాల్వలు తవ్వి వదిలేయడంతో పొలాలు నీటిపారుదలకు నోచుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కాల్వ పనులు పూర్తికాకపోవడం, ప్రధాన రహదారుల వద్ద కల్వర్టులు నిర్మించకపోవడంతో పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు వాపోతున్నారు. వచ్చే జూన్ వర్షాకాలం నాటికైనా నీరందించాలని భూములు కోల్పోయిన రైతులు కోరుతున్నారు.

కాల్వ నిండ ముళ్లకంపలు



17 ఏళ్ల క్రితం కాల్వ తవ్వి వదిలేశారు. కాల్వ నిండా కంపచెట్లు మొలిచాయి. పొలాల పక్కన అడవిలా ముళ్ల పొదలు ఉన్నాయి. రూ.60 వేలకు ఎకరా పొలం కాల్వ కోసం అప్పగించాం. అటు పొలం పోయి ఇటు పండించుకోక నీరందక నష్టపోయాం. - నారాయణ, రైతు, తనగల

ఆశలు అడియాసలయ్యాయి



తక్కువ ,ధరకు పొలాలు పోయినా నీళ్లు వస్తాయని ఆశపడ్డాం. కాల్వలు తవ్వడంతో అటు పొలం ఉపయోగపడటంలేదు. ఇటు నీళ్లు రాలేదు. లక్షలు పెట్టి బోరు బావులు తవ్వకుంటే నీరు ఇంకిపోయి పంట ఎండిపోవడంతో గొర్లకు ఇచ్చాము. - మద్దిలేటి, రైతు, రామాపురం

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

అలంపూర్: విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీ రాజు అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కరపత్రాలు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. పేదలకు నిత్యావసర వస్తువులు అందించడానికి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. ప్రతి వ్యక్తికి 10 కేజీల బియ్యం , నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందించాలన్నారు. తొలగించిన రేషన్ కార్డులను తిరిగి ఇవ్వాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న పేదలకు ఉచిత విద్యుత్ అందజేయాలన్నారు. కౌలు రైతుల హక్కులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులతోపాటు బ్యాంకు రుణాలు అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ సడక్ బంద్‌లో రైతులు, కార్మికులు, ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయన్న, నాయకులు నరసింహ్మా, సిద్ధయ్య, పుల్లన్న, ప్రకాశం, అబ్దుల్లా, రంగన్న, కృష్ణ, రాముడు, చిన్న కాశీం, చిన్న మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

స్నేహ సంఘాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం శోభారాణి

ధరూరు: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీతో పాటు, మండల పరిధిలోని అల్వాలపాడులో స్నేహ సంఘాలపై ఐకేపీ ఏపీఎం శోభారాణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 14 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు బాలికలు మాత్రమే స్నేహ సంఘాల్లో చేరేందుకు అవకాశం ఉందన్నారు. ఫ్రెండ్‌షిప్ గర్ల్స్ గ్రూప్స్ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి తద్వారా పేద బాలికల అభివృద్ధి కోసం దోహదపడతాయన్నారు. బాలికల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించడం విద్య, ఆరోగ్యం, సురక్షిత, సామాజిక నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో సీసీ జయరాజ్, నవీన్‌కుమార్, రాఘవేంద్ర, శేఖర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంలు సకాలంలో అందజేయాలి



యూనిఫాం పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాంలు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు, గ్రామ మహిళా సంఘాల సభ్యులతో సమన్వయం చేసుకుని సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం మండల పరిదిలోని మార్లబీడు గ్రామంలో టైలర్లను కలిసి యూనిఫాంలు కుట్టడాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి గ్రామంలోని బడి బయటి పిల్లలను బడికి పంపించే విధంగా చూడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విజయ్, శివకుమార్, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



వెంకటాపురంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ హరికృష్ణ

కేటీదొడ్డి: కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని తహసీల్దార్ హరికృష్ణ అన్నారు. రోజుల తరబడి వడ్లు కొనుగోలు చేయడం లేదంటూ రైతులు అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శుక్రవారం మండలంలోని వెంకటాపురంలో కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశించిన రైసు మిల్లులకు తరలించాలన్నారు. సేకరించిన ధాన్యం వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అదే విధంగా కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన వడ్లను కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ రెడ్డి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



ఉండవెల్లి: మండలంలోని మారమునగాల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న నరసింహయ్యను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. అనంతరం కార్యకర్తలు పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగ పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవి ప్రకాష్‌గౌడ్, మల్లికార్జున, బాషా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



గట్టులో అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఉండవెల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

గట్టు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ ఏపీఎం జయకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్నేహ సంఘం ఆధ్వర్యంలో కిషోర బాలికలకు బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలు, పౌష్టికాహార లోపం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం జయకర్ మాట్లాడుతూ.. జిల్లా గ్రామీణాభివృద్ధి, యూనిసెఫ్ ఆధ్వర్యంలో మే 2 నుంచి జూన్ 10 వరకు ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాల కారణంగా బాలికల్లో సరైన ఎదుగుదల లేక శారీరక, మానసికంగా ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. రక్తహీనత నుంచి ప్రతి మహిళ బయట పడాలన్నారు. కిషోర బాలికలు తప్పని సరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఓఏ సురేష్, ఎంవీఎఫ్ ప్రతినిధి వీణ, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో బాల్యవివాహాలు, ఆరోగ్యం, వేసవి సెలవుల్లో వారి భవిష్యత్‌పై వైద్యాధికారులు, మహిళ సంఘాల ఆశ్వర్యంలో యువతకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కోటీశ్వరి, ఏఎస్ఎం సుభాషిణి, సంధ్య, సీసీ రజిత, వీఓఏలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

అయిజ: పొలంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి యువకుడికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మేడికొండ గ్రామానికి చెందిన రైతు తిమ్మారెడ్డి గురువారం కళ్లం దగ్గర ఉన్న విద్యుత్ వైరును సరిచేయడానికి విద్యుత్ సూపర్‌వైజర్ ద్వారా ఎల్సీ తీసుకున్నాడని తెలిపారు. కరెంట్ వైరును సరిచేస్తుండగా అదే సమయంలో విద్యుత్ సిబ్బంది కరెంట్ ఆన్ చేయగా తిమ్మారెడ్డికి విద్యుత్ షాక్ తగిలి చేతి వేళ్లు, పొట్ట భాగానికి గాయాలైనట్లు తెలిపారు. క్షతగాత్రుడిని కర్నూలులోని ఓ ప్రైయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదంపై శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విద్యుత్ ఏఈ నరేందర్ రెడ్డిని వివరణ కోరగా.. విద్యుత్ సిబ్బంది వేరే పనులు కోసం ఎల్‌సీ తీసుకోగా విషయం తెలుసుకున్న బాధిత రైతు సర్వీస్ వైర్ సరిచేస్తుండగా విద్యుత్ సరఫరా అయి ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



శాంతినగర్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మహిళా సంఘం సభ్యులు జయమ్మ, లక్ష్మీదేవి అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మహిళా సంఘం సభ్యులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ ప్రకాష్, ఏఈఓ విమల, మాజీ సర్పంచ్ బతుకన్న, మాజీ ఉపసర్పంచ్ సంజీవనాయుడు, రైతులు పద్మనాభరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సూర్యప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై సమావేశం



రాజోళి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై నిర్వహించే సామాజిక తనిఖీపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎస్ఆర్‌పీ దేవేంద్ర మాట్లాడారు. గ్రామాల వారీగా ఉపాది హామీ పనుల్లో జరిగిన పనులపై ఆడిట్ సిబ్బంది 10 రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2024 - 25 సంవత్సరానికి గాను ఎంత మేర పనులు జరిగాయి, ఏయే పనులు చేపట్టారు, ఎంత మంది కూలీలు హాజరు తదితర అంశాలపై తనిఖీ ఉంటుందన్నారు. తనిఖీలకు గ్రామస్థాయి అధికారులు సహకరరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్, ఏపీఓ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధితులకు బీమా చెక్కు అందజేత



గట్టు: విద్యుత్ ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం గద్వాలలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా రూ.5 లక్షల పరిహార చెక్కు అందజేశారు. చాగదొన గ్రామానికి చెందిన గుంజపల్లి ముని విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుని భార్య గుంజపల్లి సరోజకు విద్యుత్ ప్రమాద బీమా ద్వారా రూ.5 లక్షల పరిహారం అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ తిరుపతిరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, నాయకులు ఉరుకుందు, చంద్రశేఖర్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం



అయిజ: పట్టణ సమీపంలోని పెద్దవాగుపై నిర్మించిన వంతెనపై రంధ్రం పడి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలో వాహనం పడితే ప్రాణాలకే ప్రమాదమని వాపోతున్నారు. అధికారులు తాత్కాలిక మరమ్మతు చేపట్టడంతో ఎటువంటి ఉపయోగం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించాల్సిన వాహనదారులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



ఆలూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సలీముద్దీన్

గట్టు: మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు కొరత కారణంగా కొనుగోళ్లు చేయక ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా గ్రామాల రైతులు తహసీల్దార్ సలీముద్దీన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గట్టు, మాచర్ల, ఆలూరు, పెంచికలపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సలీముద్దీన్, గిర్దావర్లు రాజు, నాగిరెడ్డి సందర్శించారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలపై రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు. గన్నీ బ్యాగులు, లారీల కొరత కారణంగా ఎక్కడి ధాన్యం అక్కడే పేరుకుపోయిందని రైతులు తెలిపారు. సుమారు 15 వేల గన్నీ బ్యాగుల కొరత ఉందని, తూకం పట్టిన ధాన్యం కూడా ఇక్కడి నుంచి మిల్లులకు తరలించేందుకు లారీల కొరత ఉన్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి



ఉండవెల్లి: మండలంలోని చిన్న ఆముదాలపాడు గ్రామానికి చెందిన పలువురు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాని నేపథ్యంలో శుక్రవారం ఎంపీడీఓ తిరుపతన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హులకు మాత్రమే ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సుధాకర్, వెంకటేశ్వర్లు, మహేష్, రాముడు, అంజి, అనిల్, స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు బడికి.. పెద్దలు పనికి



బడిబాట కరపత్రాలు విడుదల చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్

మల్దకల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులతో కలసి బడిబాట కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ సురేష్ మాట్లాడుతూ.. బడిఈడు పిల్లలతో పొలం పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు తమవంతు కృషి చేయాలన్నారు. పిల్లలు బడికి.. పెద్దలు పనికి అనే నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు తేదీల మార్పు

ఇటిక్యాల: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను తేదీలను పలు కారణాల వల్ల మార్పుతున్నట్లు తహసీల్దార్ వీరభద్రప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న ఉదండాపురంలో నిర్వహించాల్సిన సదస్సును 12న, అదే విధంగా 12న షాబాద్‌లో నిర్వహించాల్సిన సదస్సును 16న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు సహకరించి రెవెన్యూ సదస్సులో పాల్గొనాలని పేర్కొన్నారు.

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీపాద్

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో నిర్లక్ష్యం తగదని, పనుల్లో వేగం పెంచి కూలీలందరికీ పని కల్పించాలని ఎంపీడీఓ శ్రీపాద్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై పంచాయతీ కార్యాదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే వర్షాకాలంలో నిర్వహించే వన మహోత్సవానికి నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సిద్ధం చేయాలని, రైతుల పొలాల్లో భూమి చదును చేయడం, ఇంకుడు గుంతల ఏర్పాట్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, నర్సరీల ఏర్పాటు, ఉపాధి కూలీలకు టెంట్లు, తాగునీరు, కూలీల పెంపు, పనుల పురోగతి, తదితర విషయాలపై చర్చించారు. నిర్దేశించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, టెక్నికల్ పీఓ రఘు, పంచాయతీ కార్యాదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.